నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శనివారం 16 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

సమావేశంలో మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతీదేవి

కొనుగోలు చేసిన వస్తువులకు రసీదు పొందాలి

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతీదేవి

భువనగిరి అర్బన్, మార్చి 15 : కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా రసీదు పొందాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీ దేవి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా భువనగిరి కోర్టులో వినియోగదారుల సంక్షేమ చట్టాలు, హక్కులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ఆహార పదార్థాలు, వైద్యం, ఇతర అవసరాలకు సంబంధించిన వస్తువులకు రసీదు పొందకపోవడంతో నాణ్యతాలోపంతో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోవడం జరుగుతుందన్నారు. వ్యవసాయదారులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, రసాయనాలపై తప్పని సరిగా రసీదు పొందాలని సూచించారు.

వినియోగదారులు ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, లేదంటే చట్టపరమైన చిక్కులతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రసీదు పొందితే కన్జుమర్ ఫోరంను ఆశ్రయించి తగిన నష్టపరిహారాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి సీహెచ్.రాజశేఖర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, స్వామి, సత్యనారాయణ, కేశవరెడ్డి, బాబురావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి ఎంఏ కృష్ణన్

యువత ఓటు నమోదు చేసుకునేలా చూడాలి

- యువ ఓటర్లకు ఓటు విలువపై అవగాహన కల్పించాలి
- డీఆర్‌డీఓ, ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి ఎంఏ కృష్ణన్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 15 : పార్లమెంట్ ఎన్నికల్లో యువత వంద శాతం ఓటు నమోదు చేసుకునేలా స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఎన్నికల స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎంఏ కృష్ణన్ క్యాంపస్ అంబాసిడర్లకు సూచించారు. విద్యార్థులను ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు క్యాంపస్ అంబాసిడర్లుగా నియమితులైన ప్రిన్సిపాల్స్, డీపీఎం, ఏపీఎంలకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలన్నారు. అందుకోసం కళాశాలల్లో విద్యార్థులకు ఓటు విలువ తెలియజెప్పేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్ ఒకటి నాటికి 18 ఏండ్లు నిండే ప్రతి విద్యార్థిని ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. యువ ఓటర్లు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా క్యాంపస్ అంబాసిడర్లు అవగాహన కల్పించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా అభ్యర్థులను ఎన్నుకుంటే వారి నుంచి మనం మంచిని ఆశించవచ్చనే విషయాన్ని తెలియజెప్పాలని సూచించారు. ఎన్నికల్లో జరిగే అక్రమాలపై సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. ఎంసీసీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనలు పకడ్బందీగా అమలవుతాయని ప్రజలకు, యువతకు తెలియాల్సి ఉన్నదన్నారు. వంద శాతం ఓటు నమోదు, వినియోగం జరిగేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి చిలుక రమణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డీపీఎం, ఏపీఎంలు, అధికారులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 15 : వచ్చే మూడు సంవత్సరాలకు గానూ హరితహారంలో మొక్కలు నాటడానికి వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024, 2025, 2026 సంవత్సరాలకు గాను హరితహారంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. రాబోయే జూన్, జూలై నెలల్లో వర్షాలకనుగుణంగా మొక్కలు నాటాలని, శాఖల వారి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, చెరువు కట్టలు, రోడ్ల వెంట మొక్కలు నాటాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, డీఏఓ అనూరాధ, డీపీఓ సునంద, జిల్లా ఉద్యానవన అధికారి అన్నపూర్ణ, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 84 కిలోల సరుకు స్వాధీనం

చౌటుప్పల్ రూరల్, మార్చి 15 : మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద మహేశ్వరం జోన్, చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 84 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్, బిహార్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు సభ్యులు గల ముఠా గంజాయిని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు ప్రైవేటు ట్రావెల్ బస్సులో సరఫరా చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం మహేశ్వరం జోన్, చౌటుప్పల్ పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన సాహిద్(25), ఎండీ అస్లాం (61), ఢిల్లీలోని కర్‌వాల్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ (28), బజన్‌పూర్‌కు చెందిన సచిన్‌కుమార్(39), దయాల్‌పూర్‌కు చెందిన మహ్మద్ జాహిద్ (51), బిహార్ రాష్ట్రానికి చెందిన ఒక మైనర్‌ను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే నాలుగు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజమండ్రికి చెందిన గంజాయి సరఫరాదారుడు రఘువీర్‌రాయ్‌ను బీబీనగర్ వద్ద అరెస్టు చేశారు.

విక్రయదారుడు ముఖేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న మహేశ్వరం, చౌటుప్పల్ పోలీసులను ఐపీఎస్ తరుణ్‌జోష్, రాచకొండ పోలీస్ కమిషనర్ మురళీధర్ అభినందించారు. తనిఖీల్లో ఎస్ఐ సైదాబాబు, ఏఎస్ఐ రాజు, వి.అశోక్‌రెడ్డి ఉన్నారు.

వైదారోగ్యశాఖలో పోస్టులకు దరఖాస్తులు

నీలగిరి, మార్చి15 : జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి కలిగిన వారు మార్చి 18లోగా దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అన్నిమల్ల కొండల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, ఎంఎల్‌హెచ్‌పీ, మెడికల్ ఆఫీసర్, పీడియాట్రిషియన్, ఫికోలజిస్టు, రెఫ్రిజిరేటర్స్, క్వాలిటీ మేనేజర్, జిల్లా పోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టులకు అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు <https://nalgonda.telangana.gov.in> వెబ్‌సైట్‌లోగానీ, కార్యాలయంలోగానీ తెలుసుకోవచ్చని తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు

- ఎక్కడికక్కడ ఆందోళనలు
- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- నేడు నల్లజెండాలతో శాంతియుత నిరసనలు
- అక్రమ అరెస్టు అంటూ మండిపాటు

భువనగిరిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ కవితను రాత్రికి రాత్రి అక్రమంగా అరెస్టు చేశారని, కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుమ్మక్కై రాజకీయ లబ్ధి కోసమే ఈ కుట్రకు పాల్పడ్డాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. పార్టీ నుంచి పిలుపు ఇవ్వకపోయినా అరెస్టు విషయం తెలుసుకున్న వెంటనే సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. బీజేపీ, ప్రధాని మోడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కవిత అరెస్టును మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. సూర్యాపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జనగాం క్రాస్ రోడ్డు వద్ద జాతీయరహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. అర్వపల్లి మండల కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు.

నల్లగొండ జిల్లా దేవరకొండలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ధర్నా చేట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి జిల్లా కేంద్రం, అడ్డగూడూరు, మోత్కూరులో పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. భువనగిరిలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ నేడు గ్రామాలు మొదలుకొని అన్ని స్థాయిల్లో పార్టీ కేడర్ నల్లజెండాలతో శాంతియుత ధర్నాలు, నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం పిలుపునివ్వగా.. ఆ మేరకు శ్రేణులు సిద్ధమవుతున్నారు.

కవిత అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కుట్రే

- రాజ్యాంగ సంస్థలన్నింటినీ బీజేపీ తన జేబు సంస్థలుగా మార్చింది
- రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకు మోదీ సర్కారు కుట్రలు
- బీజేపీకి ఎదురు నిలబడింది దేశంలో కేసీఆర్ ఒక్కరే
- కవిత నిర్దోషిగా బయటకు వస్తారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కుట్ర అని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ, కవిత అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ సంస్థలన్నింటినీ బీజేపీ తన జేబు సంస్థలుగా మార్చిందని మండిపడ్డారు. కవితను అరెస్ట్ చేయబోమని ఈడీ గతంలో సుప్రీంకోర్టుకు చెప్పిందన్నారు. ఇప్పటికే పలుమార్లు పిలిచినా కవిత విచారణకు హాజరై కావాల్సిన సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకు మోదీ సర్కార్ కుట్రలు చేస్తున్నదన్నారు. వారు ఢిల్లీ నుంచి వచ్చేటప్పుడే ఫ్లైట్ టికెట్లు కూడా బుక్ చేసుకున్నారని ఆరోపించారు. బీజేపీలో చేరితే కేసులు రద్దు చేస్తున్నారని లేకపోతే వేధిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థుల్ని లొంగదీసుకునేందుకు బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదన్నారు. అనేక రాజకీయ పార్టీల నాయకులను ఇలాగే లొంగతీసుకుని తమ పార్టీలో జాయిన్ చేసుకున్నారని దుయ్యబట్టారు. బీజేపీకి ఎదురు నిలబడింది దేశంలో కేసీఆర్ ఒక్కరే అన్నారు. కవిత నిర్దోషిగా బయటకు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కక్షపూరితంగా అక్రమ అరెస్టు

- బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

అడ్డగూడూరులో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

మోత్కూరు, మార్చి 15 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కవిత ఇండ్లపై ఈడీ సోదాలు జరిపి అరెస్టు చేయడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, బీజేపీ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవిత అరెస్టు అని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు జంగ శ్రీను, కొండ సోంమల్లు, సత్యంగౌడ్, మర్రి అనిల్‌కుమార్, విష్ణు, పరమేశ్, నాగరాజు పాల్గొన్నారు.

అర్వపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డగూడూరులో..

అడ్డగూడూరు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో అరెస్టు చేయడాన్ని ఖండించారు. బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, బాలెంల అరవింద్, చెరకు మధు, గూడెపు నరేశ్, కృష్ణ, పరమేశ్, మత్స్యగిరి, నాగయ్య పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్, మార్చి 15 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును ఖండిస్తూ పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితను కుట్రతోనే అరెస్టు చేసి కేంద్ర ప్రభుత్వం తమ నిరంకుశ పాలనను బయట పెట్టిందన్నారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న క్రమంలో ఈడీ అధికారులు ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలనే కోణంలో బీజేపీ కుట్రలు పన్నుతున్నదని, వారి కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ కవితను వదిలి పెట్టకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండలాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోమారి సుధాకర్‌రెడ్డి, నువ్వుల సత్యనారాయణ, ఇట్టబోయిన గోపాల్, సుధాకర్, రమేశ్, సుజిత్, సుభాశ్, నితీశ్, నీరజ్ పాల్గొన్నారు.

పొన్నవాహనంపై మురళీకృష్ణుడిగా..

గుట్ట తిరుమాఢవీధుల్లో లక్ష్మీనరసింహుడి ఊరేగింపు

- వైభవోపేతంగా బ్రహ్మోత్సవాలు.. అలంకార సేవలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక, ధార్మిక ప్రదర్శనలు
- నేడు గోవర్ధనగిరిదారి అలంకారం.. సింహవాహనంపై ఊరేగింపు

పొన్నవాహనంపై మురళీకృష్ణుడి అలంకారంలో లక్ష్మీనరసింహుడు

యాదగిరిగుట్ట, మార్చి15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలంకార సేవలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం నిత్య పూజల అనంతరం స్వామివారిని శ్రీమన్నారాయణుడి పూర్వఅవతారమైన శ్రీకృష్ణావతారం(మురళీకృష్ణుడు)గా అలంకారంలో ముస్తాబు చేశారు. రాత్రి కల్పవృక్ష సమానమైన పొన్న వాహనంపై అధిష్ఠింపజేసి తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. లక్ష్మీనరసింహస్వామి శనివారం ఉదయం గోవర్ధనగిరిధారిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి సింహవాహనంపై ఊరేగింపు ఉంటుంది.

మురళీకృష్ణుడిగా...

మెడలో స్వర్ణ, వజ్ర, ముత్యాల ఆభరణాలు.. చేతిలో సుమధుర గానామృతాన్ని పంచే పిల్లనగ్రోవి.. ఒంటిపై పట్టుపీతాంబరాలు.. సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన దివ్య మంగళ రూపులో సకల జనావళిని సమ్మోహనం చేస్తూ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి శ్రీకృష్ణావతారం(మురళీకృష్ణుడు)లో దర్శనమిచ్చారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో ఐదో శుక్రవారం ఉదయం నిత్యపూజల అనంతరం స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో పెండ్లి కుమారుడిగా ముస్తాబయ్యారు. ఈ సందర్భంగా వేద, పురాణ, ఇతిహాస ప్రవచనాలను అర్చకులు స్తుతించారు. సంగీతం, సాహిత్యం, శాస్త్రం, వేదం, నాదం వంటి వైదృశ్యాలతో స్వామివారి మహోత్సవం, ప్రధానాలయం తిరుమాఢవీధుల్లో స్వామివారి ఊరేగింపు సేవను అత్యంత వైభవంగా చేపట్టారు. తూర్పు మాఢవీధుల్లోని ప్రత్యేక మండపంలో స్వామివారిని ఆస్థానం చేశారు. స్వామివారి అలంకారమైన నాలుగు వేదాలు, శ్రీకృష్ణాలంకారం యొక్క సూక్తులను పఠించారు. దివ్య ప్రబంధంలోని అలంకార వైభవ పాశురాలను పఠిస్తూ స్వామివారి అలంకార విశిష్టతను ప్రధానార్చకులు నల్లన్‌థిఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు వివరించారు. భగవానుడి అవతారాల్లో దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ గావించిన అపూర్వమైన అవతారమే శ్రీకృష్ణావతారం. ఎన్నో అద్భుతాలను దర్శింపజేసిన కృష్ణావతారంలో మురళీకృష్ణుడిగా తన దివ్యమైన వేణుగాననాదంతో సమస్త ప్రాణికోటికి చైతన్యాన్ని, బలాన్ని, జ్ఞానాన్ని, ముక్తిని అందించిన అపూర్వ స్వరూపమని సర్వదా స్మరణీయమని పేర్కొన్నారు.మురళీకృష్ణుడి సేవలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.

స్వామివారి సేవను మోస్తూ తిరుమాఢవీధుల్లో తిరిగారు. రాత్రి ప్రధానాలయంలో నిత్యకైంకర్యాల అనంతరం స్వామివారిని పొన్న వాహనంపై ఊరేగించారు. బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రఘు, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొన్నవాహన స్వరూపం..

పొన్న వృక్షమును దేవ వృక్షంగా పురాణాలు పేర్కొన్నాయని ఆలయ ప్రధానార్చకులు తెలిపారు. అందుకే దానికి కల్పవృక్షమని పేరు. 'కల్పయతి వాంఛిత మితి' అనగా కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువు అని అర్థం. సకల చరాచర జగత్తంతా మహావృక్షం వంటిది. అలాంటి సంసార మనే మహావృక్షానికి బీజం పరమాత్మ ప్రకృతిలోని ప్రతితత్వం పరమాత్మకు చెందినదేనని 'భక్తాభీష్ట వరప్రదాయని అయిన స్వామివారు పొన్నవృక్షారూఢుడై భక్తులను దర్శనమిచ్చారని ఆలయ ప్రధానార్చకులు వివరించారు.

మురళీకృష్ణుడిగా మాఢవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

భజనలు.. నృత్య ప్రదర్శనలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాత భేరీ, ఆస్థానం వారి మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలు కొనసాగాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి బాబా సేవా సమితి , భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ భక్తభజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి మహిళా భజనామండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీమసన చెన్నప్ప వారి ఉపన్యాసం, అల్లం కనకదుర్గ భాగవతారణితో భక్త ప్రహ్లాద హరికథ, జనగామకు చెందిన కొండూరి పద్మావతి బృందం వారితో శ్రీనరసింహ సహస్రనామసోత్ర పారాయణం గావించారు. సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన ఇందిర, రాధిక మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ, విష్ణుప్రియతో భక్తి సంగీతం, తూడూరి రేణుక, సౌందర్యకౌశిక్, కుమారి స్వతంత్ర కృష్ణ, అన్నదానం శ్రీసహస్ర బృందం, కుమారి ప్రణుతి అదర్శిని వారితో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, జనగామకు చెందిన చంద్రకళానిలయం వారిచే పేరిణి నృత్యం ఆకట్టుకున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న పారాయణికుడికి గాయాలయ్యాయి. మురళీకృష్ణుడి సేవను తూర్పు మాఢవీధుల్లో వేంచేపు చేసే క్రమంలో అక్కడే ఉన్న మీడియా వైర్లు కాలికి తగలడంతో పక్కనే ఉన్న సౌండ్ బాక్స్ పారాయణందారుడి కాలిపై పడింది. దాంతో ఆయన కాలికి తీవ్ర గాయాలు అవడంతో వైద్యులు వచ్చి ప్రథమ చికిత్సను చేసి, స్థానిక దవాఖానకు తరలించారు.

నేడు గోవర్ధనగిరిధారి అలంకారం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి శనివారం ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనం ఇవ్వనున్నారు. రాత్రికి సింహవాహనంపై తిరుమాఢవీధుల్లో ఉరేగనున్నారు.